పారిశుద్ధ్య కార్మికులకు రుణమేళా


మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీలో స్వచ్ఛ ఉద్యం యోజన అనే అంశంపై పారిశుద్ధ్య కార్మికులు, చెత్త సేకరణ కార్మికులకు ఆటోలు సెప్టిక్ ట్యాంకులు జేసీబీలు ఇతర వాహనాలకు 50 శాతం సబ్సిడీపై రుణాలిచ్చేందుకు సోమవారం రుణ మేళాను నిర్వహించారు. కార్యక్రమంలో స్కీమ్ సౌత్ ఇండియా ఇన్‌చార్జి కె.సహదేవయ్య, ఎస్.చిన్నకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... పథకం గురించి లబ్ధిదారులకు వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, స్టేట్ కో ఆర్డినేటర్ మల్లేష్‌రాజు, ఎస్‌డబ్ల్యూఎం దేవేందర్, శానిటేషన్ జవాన్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తిచేయాలి

మైలార్‌దేవ్‌పల్లి: దేవాలయాల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హనుమాన్ ఆలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండప పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రూ. 35 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులలో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. అందుబాటులోకి వస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అక్కెం కృష్ణా, రావుల భాస్కర్, చిన్న జంగయ్య, దాసు, అనిల్ ముదిరాజ్, సురేందర్ ముదిరాజ్, పాండుయాదవ్, నవారు మురళి, నరసింహశర్మ, రఘు, చిన్న, ఉడుత లక్ష్మి, నాగమణి, ఎ.శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ

రాజేంద్రనగర్: ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సెల్‌ఫోన్ చోరీకి గురైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడి సమాచారం మేరకు... ఓంనగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మారెడ్డి విద్యుత్ శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. నిత్యం బండ్లగూడ ఆరె మైసమ్మ దేవాలయం వద్ద ఉన్న బస్టాప్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. సోమవారం ఉదయం బస్సులో ఎక్కి సీటులో కూర్చొని జేబులో చూసుకోగా.. సెల్‌ఫోన్ కనిపించలేదు. ఇతరుల ఫోన్ నుంచి తన సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 20 రోజుల క్రితం ఇదే బస్టాప్ వద్ద లక్ష్మారెడ్డి సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఈ విషయాన్ని సైతం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాడు సెల్‌ఫోన్‌ను దొంగలించిన దొంగలు గూగుల్ పే, ఫోన్ పేల ద్వారా రూ. 1.05 లక్షలను దొంగలించారు. ఇందులో రూ. 45 వేలను పోలీసులు రికవరీ చేశారు. ఈ బస్టాప్ వద్ద దొంగల ముఠా రోజూ చోరీలకు పాల్పడుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

పాఠశాల వార్షికోత్సవం

గచ్చిబౌలి: మసీద్‌బండ బచ్‌పన్ హైట్స్ స్కూల్ వార్షికోత్సవం సందడిగా జరిగింది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో జరిగిన వార్షికోత్సవంలో చిన్నారులు వివిధ రకాల నృత్యాలు చేశారు. సందేశాత్మక నాటికలు ప్రదర్శించారు. బచ్‌పన్ స్కూల్స్ రీజనల్ డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, శేషారెడ్డి, విద్య తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్.. ఇష్టారాజ్యం!

- నో పార్కింగ్ జోన్‌లో యథేచ్ఛగా ఆగుతున్న వాహనాలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- హోటళ్ల ముందు రోడ్డుపై ఆక్రమ పార్కింగ్
- ఫుట్‌పాత్‌లపై రోజురోజుకూ పెరిగిపోతున్న ఆక్రమణలు


జాతీయ రహదారి పక్కన అడ్డగోలుగా ఆపిన వాహనాలు

బండ్లగూడ: కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్ జామ్‌లు నెలకొంటున్నాయి. నియంత్రించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది. చట్టవిరుద్ధమైన పార్కింగ్‌లు రోడ్డు స్థలాన్ని మాయం చేయడంతో తరచూ ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తున్నది.
- టిప్పుఖాన్ పూల్ బ్రిడ్జి నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు ఆక్రమంగా రోడ్డుపై పార్కింగ్ చేయడంతో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. హోటళ్లు, టీకొట్లు, తోపుడు బండ్ల వద్ద వాహనాలను అడ్డగోలుగా ఎక్కడ పడితే అక్కడ నిలిపేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతూ అత్యవసర పరిస్థితిల్లో అంబులెన్స్‌లు సైతం రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు ఉత్పన్నం అవుతున్నాయి.
- ఫుట్‌పాత్‌లు కూడా ఆక్రమించడంతో నడుచుకుంటూ వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపైనే వెళ్తూ ఒక్కోసారి ప్రమాదాలబారిన పడుతున్నారు.
- జాతీయ రహదారిని ఆనుకొని తెలంగాణ పోలీస్ అకాడమీ సర్కిల్, బండ్లగూడ జాగీర్ ప్రధాన రహదారిపై ఉన్న హోటళ్ల ముందు రోడ్డుపైనే పార్కు చేసి వెళ్లడంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌తో పాటు పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా ట్రాఫిక్ పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. హోటళ్ల ముందు వాహనాల పార్కింగ్‌లను ట్రాఫిక్ పోలీసులు అరికట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో పరేషాన్...

- కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రధాన జాతీయ రహదారి పొడవునా రెండు వైపులా ఫుట్‌పాత్‌లపై చిన్నచిన్న వ్యాపార కేంద్రాలు వెలిశాయి. అయి కాస్తా కొద్దికొద్దిగా రోడ్డుపైకి వచ్చేశాయి.
- సన్‌సిటీ, బండ్లగూడ జాగీర్ తదితర ప్రాంతాల్లో వాహనాల పార్కింగులు రోడ్డుపైనే పెడుతుండటంతో ముందుకు వెళ్లాల్సిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు.



పోలీస్ అకాడమీ సమీపంలోని ఓ హోటల్ ఎదుట వాహనాల పార్కింగ్

చలానాలపైనే ట్రాఫిక్ పోలీసుల దృష్టి..

- ట్రాఫిక్ సమస్యపై పత్రికల్లో పలుమార్లు కథనాలు ప్రచురితం అవుతున్నాయి. ప్రజలు ముఖ్యంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా నార్సింగి ట్రాఫిక్ పోలీసులు స్పందించడం లేదు. వారు వాహనదారులకు చలానాలు విధించడంపైనే అధిక దృష్టి సారిస్తుండటంతో ట్రాఫిక్ పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది.
- హోటళ్ల ముందు అడ్డగోలుగా వాహనాల పార్కింగులకు పాల్పడుతున్న వారు... ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిపై చర్యలు చేపట్టకపోవడంతో ట్రాఫిక్ పోలీసుల తీరుపై పలు అనుమానాలకు తావిస్తుందని స్థానికు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు పలు హోటళ్ల ముందు అడ్డగోలుగా పార్కింగులు.. ఫుట్‌పాత్‌లపై ఆక్రమించి వ్యాపారాలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ మహా ప్రదర్శనను విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'లక్షల డప్పుల వేల గొంతులు' అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ గండిపేట్ మండల ఇన్‌చార్జి పుట్లగారి గణేష్‌మాదిగ మాట్లాడుతూ... ఫిబ్రవరి 7వ తేదీన 'లక్ష డప్పులు.. వేల గొంతులు' మహా ప్రదర్శన ఎల్‌బీ స్టేడియం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ చంకన డప్పు వేసుకొని ప్రతి మాదిగ బిడ్డ, ఉపకులాల వారు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇకనైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణను వెంటనే అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఎన్నికల్లో మాదిగ ఉపకులాల సత్తా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రజనీకాంత్‌మాదిగ, నాయకులు పెద్దపల్లి శంకర్‌మాదిగ, రవికుమార్‌మాదిగ, అధికారప్రతినిధి ఉపేందర్‌మాదిగ, కిరణ్‌మాదిగ, రంజిత్‌మాదిగ, టిట్లు మాదదిగ, యాదవ్‌రావుమాదిగ, రోహన్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

'భారతి అల్ట్రాఫాస్ట్' నాణ్యమైన ఎంపిక

శంషాబాద్: దృఢమైన కట్టడాలకు భారతి అల్ట్రాఫాస్ట్ నాణ్యమైన ఎంపిక ప్రక్రియ అని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహేర్ అన్నారు. సోమవారం శంషాబాద్ పట్టణంలోని రాళ్లగూడలోని గణేశ్ స్టీల్ దుకాణం వద్ద తాపీ మేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా.. నాణ్యతతో జరుగుతుందన్నారు. స్లాబులు, పిల్లర్లు, వంతెనలు, రహదారుల నిర్మాణాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వినియోగదారులకు కావాల్సిన సాంకేతిక సాయాన్ని కూడా అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీలర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాపీ మేస్త్రీలకు బీమా బాండ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారం

- వేసవిలో సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు
- రాజేంద్రనగర్ డీఈ రత్నాకర్‌రావు


పి.రత్నాకర్‌రావు, డీఈ

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ వినియోగదారులు తమ ప్రాంతాలలో ఉన్న విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ పి.రత్నాకర్‌రావు తెలిపారు. సోమవారం శివరాంపల్లిలోని విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం వేసవిలో వినియోగదారులు విద్యుత్ సమస్యను ఎదుర్కొకుంటూ నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందన్నారు. డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు వేసవిలో వినియోగదారులు ఇబ్బందులు గురికాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిశీలించి అంచనాలు రూపొందిస్తున్నారని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమ ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు విరిగిన, వైర్లు వేలాడుతున్న, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్న వాటిని సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు.

ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ

విజేతగా నిలిచిన ఏఎస్‌రావు నగర్ జట్టు


విజేతలతో ముఖ్య అతిథులు

మణికొండ: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం మణికొండలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఘనంగా జరిగాయి. ఇందులో మణికొండ, ఏఎస్‌రావు నగర్, హన్మకొండ, బీహెచ్ఈఎల్, కేపీహెచ్‌బీ కాలనీ, గాయత్రినగర్, గట్టుప్పల్, చేవెళ్ల, కరీంనగర్, సంగారెడ్డి, మెదక్ తదితర ప్రాంతాల జట్లు పాల్గొన్నాయి. పోటీలను మణికొండ మున్సిపాలిటీ డీఈ శివసాయి, అత్తాపూర్‌లోని జర్మెంటిస్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ సంతోష్ ఆదివారం ప్రారంభించారు. సోమవారం జరిగిన ఫైనల్ పోటీలలో టోర్నమెంట్ విజేతగా ఏఎస్‌రావు నగర్ కాలనీకి చెందిన మారుతి బాల్ బ్యాడ్మింటన్ జట్టు నిలిచింది. రెండవ స్థానంలో బీహెచ్ఈఎల్ సంకల్ప బాల్ బ్యాడ్మింటన్ జట్టు, మూడవ స్థానంలో హన్మకొండ, నాలుగో స్థానంలో మణికొండ జట్లు నిలిచాయి. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సాయికిరణ్, రెండవ ఆటగాడిగా శశిలు నిలిచారు. ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, సహాయ కార్యదర్శి కమల్, అత్తాపూర్ జర్మెంటిస్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ జావేద్ జార్ ఖాన్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన క్రీడను ఎంచుకుని సాధన చేసి రాణించాలన్నారు. ఆటలతో క్రీడా సంబంధాలతోపాటు మానవ సంబంధాలు కూడా మెరుగుపడటమే కాకుండా పరిపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. త్వరలోనే జూనియర్ పోటీలను నిర్వహిస్తామన్నారు. మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్, ఉపాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు నరహరి శాస్త్రి, సీతారామరాజు, రమేష్, రామిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాజు, ఆసిమ్, నవీన్‌కుమార్, ఎ.లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విజేతలకు మెమోంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఇష్టపడి చదివితేనే లక్ష్యసాధన


డాక్టర్ శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: న్యూఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ సంచాలకుడిగా నియమితులైన వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి, నార్మ్ మాజీ సంచాలకుడు డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్‌రావును భారత, మృత్తిక శాస్త్ర సంఘం ఘనంగా సన్మానించింది. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ సి.హెచ్.విద్యాసాగర్ నేతృత్వంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... తాను విద్యను అభ్యసించిన బాపట్ల వ్యవసాయ కళాశాల అలాగే నార్మ్‌లో చాలా నేర్చుకున్నానని తెలిపారు. నిరంతర కృషి, పట్టుదల, సరైన లక్ష్యంతో ఇష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను సులువుగా చేరుకోవచ్చన్నారు. అందుబాటుతో ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకొని ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మృత్తిక శాస్త్ర విభాగం అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. కాటేదాన్ చౌరస్తాలో సీపీఎం రాజేంద్రనగర్ మండల సీనియర్ నాయకులు ఎస్.రామ్మోహన్‌రావు అధ్యక్షతన కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక బడ్జెట్ 2025ను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ... దేశాభివృద్ధికి విఘాతం కల్గించేలా బడ్జెట్ ఉందన్నారు. అన్ని రంగాల్లోని కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా బడ్జెట్‌లో తెలంగాణకు సున్న బడ్జెట్ కేటాయించడం దుర్మార్గం అని అన్నారు. నాయకులు పి.సి.కె.భాస్కర్, కాలే రాజు, సచిన్, దత్తు, శశికాంత్, లక్ష్మణ్, యాదగిరి, మల్లేష్, నర్సింహ, నరహరి, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


కాటేదాన్ చౌరస్తాలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

'ప్రజావాణి' ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

రాజేంద్రనగర్: ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదునూ సత్వరమే పరిష్కరించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వివిధ విభాగాల్లో మొత్తం 6 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్, ఎంటమాలజీ, వెటర్నరీ, శానిటేషన్ అండ్ యూబీడీ సెక్షన్లకు సంబంధించిన ఫిర్యాదులను అందాయన్నారు. తమకు అందిన ఫిర్యాదులను ఆయా విభాగాల సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ డాక్టర్ రవికుమార్

తడి, పొడి చెత్తను వేరు చేయాలి


చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటో కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 20వ డివిజన్ బాలాజీనగర్ కాలనీ, 21వ డివిజన్‌లోని సాయిబాబానగర్ కాలనీ, 22వ డివిజన్‌లోని వినాయకనగర్ కాలనీలలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. తడి, పొడి, హానికారక చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని సూచించారు. శానిటరీ జవాన్లు సుభాష్, రాము పాల్గొన్నారు.

ఆకతాయిల వీరంగం.. యువకుడిపై దాడి

గచ్చిబౌలి: మద్యం మత్తులో ఆకతాయిలు రోడ్లపై వీరంగం చేస్తున్నారు. వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నారు. మణికొండలోని పోచమ్మబస్తీలో కొందరు యువకులు అర్ధరాత్రి దాటాక రోడ్లపై తిరుగుతూ వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఓ యువకుడిని అటకాయించి దాడికి పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హకీంపేట్ స్పోర్ట్ స్కూల్‌లో డిగ్రీ చదివే విద్యార్థి వి.నాగార్జునరెడ్డి పార్ట్ టైం రాపిడో బైక్ నడుపుతాడు. మణికొండ పోచమ్మ బస్తీలో నివాసం ఉంటున్న అతను సోమవారం తెల్లవారు జామున 2.40 గంటల సమయంలో రాపిడో రైడ్‌కు బయలుదేరాడు. బస్తీలో 12 మంది యువకులు రోడ్డుకు అడ్డంగా బైక్‌లు నిలిపారు. వారిని చూసి నాగార్జున పక్కనుంచి వెళుతుండగా బూతులు తిట్టారు. పట్టించుకోకుండా వెళుతుండగా వెనక నుంచి బైక్‌లపై వెళ్లి కొట్టారు. భయపడి యువకుడు తిరిగి ఇంటికి రాగా అక్కడకు వచ్చిన ఆకతాయిలు మళ్లీ గొడవకు దిగారు. కుటుంబ సభ్యులు రావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఓ బైక్‌ను పట్టుకొని రాయదుర్గం మొబైల్ పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని దాడికి పాల్పడిన కొందరిని గుర్తించామని ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.


దాడి చేస్తున్న ఆకతాయిలు


పలకలు పంపిణీ చేస్తున్న సంస్థ చైర్మన్ కుమారస్వామి


పోచమ్మ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

వేడుకగా వసంత పంచమి

- చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం
- సరస్వతీ దేవికి హోమాలు, ప్రత్యేక పూజలు

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మానవ సేవే మాధవ సేవా అనే సంస్థ ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి చిత్రపటం, బ్లాక్ బోర్డు, పలకలను పంపిణీ చేశారు. సరస్వతీ పూజ అనంతరం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాలు విద్యా ప్రారంభ కేంద్రాలుగా మారాలని, ఇవి సరస్వతీ నిలయాలుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ప్రసవ సేవలు, మూడు సంవత్సరాల పిల్లలకు ప్రాథమిక విద్యను అందిస్తారని అన్నారు. అయితే కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక నాయకులు, యువజన నాయకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డైరెక్టర్ హేమలత, కె.సంధ్య, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, స్థానిక నాయకురాళ్లు రక్షిత, లక్ష్మి పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో...

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ శ్రీశ్రీ పోచమ్మ ఆలయంలో సోమవారం వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసంతో పాటు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సరస్వతీ దేవి పేరిట పెన్నులను పంపిణీ చేశామని ఆలయ నిర్వాహకుడు నరేందర్ తెలిపారు.


సరస్వతీ శిశుమందిర్‌లో..

సరస్వతీ శిశు మందిర్‌లో...

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. అనంతరం 44 మంది చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా భాగ్యనగర్ విభాగ్ అధ్యక్షులు డాక్టర్ అమరేందర్, గుమ్మడి రామచంద్రారెడ్డి, పాఠశాల అధ్యక్షుడు సదాచంద్రరెడ్డి, కమిటీ సభ్యులు కన్నడ జనార్ధన్ రెడ్డి, చెరుకుపల్లి సింహం రెడ్డి, వెంకటేశ్ గౌడ్, ప్రధానాచార్యులు, పోషకులు పాల్గొన్నారు.


సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు